న్యాయవాదికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

న్యాయవాది వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 20: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లును మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వెంకటేశ్వర్లుకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

స్కూటీని ఢీకొట్టిన ట్రాక్టర్ ..ఇద్దరికి తీవ్రగాయాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20: స్కూటీని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కూచిపూడి గ్రామానికి చెందిన శిరంశెట్టి శ్రీను గురువారం ట్రాక్టర్‌పై కోదాడకు బయలుదేరాడు. మండల పరిధి నల్లబండగూడెం శివారులోని జాతీయ రహదారిపై ముందున్న కారును తప్పించబోయి స్కూటీని ఢీకొట్టడంతో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తూరుకు చెందిన బొమ్మ వెంకటేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడడంతో శ్రీనుకు సైతం తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో ఇద్దరిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి : తాసీల్దార్

అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న తాసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి, ఫిబ్రవరి 20: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని తాసీల్దార్ హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎంపీడీఓ లాజర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్, మండల వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఏఈ అమర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

ఆత్మకూర్.ఎస్: లింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోతె: కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మండలాధ్యక్షుడు సైదులు, నాయకులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 20: మండలంలోని ఏనుబాముల గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ గుజ్జేటి లింగారెడ్డి సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. సంస్మరణ సభలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుర్రం సత్యనారయణరెడ్డి, జీవన్‌రెడ్డి, జీడి భిక్షం, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొని లింగారెడ్డికి నివాళులర్పించారు. మోతె: మండలంలోని సర్వారం మాజీ సర్పంచ్ మేకల గురుకృష్ణ తండ్రి కృష్ణయ్య ఇటీవల మృతిచెందగా.. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, నాయకులు గురువారం వారి నివాసానికి వెళ్లి కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్సూర్, మండల నాయకులు రామకోటి, మిక్కిలినేని సతీశ్, ఉప్పల సౌడయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతారాం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 20: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూప్రాన్ సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏండ్ల తరబడి విధులు నిర్వహించిన ఉద్యోగులకు రిటైర్ అయిన తర్వాత నెల నెలా రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఆసరా పెన్షన్ కన్నా తక్కువగా పెన్షన్ అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో హెల్త్‌కార్డుపై వైద్యం అందించేందుకు ఆసుపత్రులు వెనుకాడుతున్నాయని తెలిపారు. ప్రతి ఉద్యోగి రిటైర్ అయ్యే సమయంలో ఎంతైతే వేతనం ఉందో అదే వేతనాన్ని పెన్షన్‌గా అందజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లపై కఠిన వైఖరి అవలంబిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెడిద సోమయ్య, మల్లు వెంకట్రామిరెడ్డి, పెరుమాళ్ల రాజారావు, మన్నె యాదగిరి, అంజయ్య, కృష్ణయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

గణపురం పార్వతమ్మ, W/o. (లేట్) గణపురం కృష్ణ, R/o. P.A.పల్లి గ్రామం, మండలం నల్లగొండ జిల్లా అనునాయిక్క నా భర్త లేట్ గణపురం కృష్ణ పేరునగల Open Plot No.3/2 in part డాక్యుమెంట్ No.5203/2021 పోయినది దొరికిన వారు సంప్ర:9848775792.

CHANGE OF NAME

★I, DEVA DAS MUDI, R/o. 12-173, Christain Colony, Devarakonda, Nalgonda Dist-508 248, TS. Changed My Name to SHELMON DEVADAS MUDI, S/o. Devadas Shelmon Mudi.
NT-329808

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

అర్వపల్లి: ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి జాజిరెడ్డిగూడెం ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- **కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

అర్వపల్లి, ఫిబ్రవరి 20: ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. గురువారం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి జాజిరెడ్డిగూడెం, తుంగగూడెంలలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. జాజిరెడ్డిగూడెం వద్ద మూసీ వాగులోని ఇసుకను మంజూరు చేసిన ప్రాజెక్టులకు సక్రమంగా సరఫరా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని జీపీఎస్ ద్వారా తాసీల్దార్, మైనింగ్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇసుకను రీచ్ నుంచి తరలించే సమయంలో సీసీ కెమెరాల ఎదుట మెజర్‌మెంట్ వేయాలని, రీచ్‌లలో హై రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏజీ విజయరామరాజు, టీఎస్ఎండీసీ పీఓ శ్రీరాములు, ఆర్డీఓ వేణుమాధవరావు, తాసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ గోపి, సీఐ రఘువీర్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ జలంధర్ రావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆలయ ఆవరణలో జాతర పనుల ప్రగతిపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రభలు, ఎద్దుల పందేలు, అన్నదానం, తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ శ్రీనివాసులు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, తాసీల్దార్ జ్యోతి, సీఐ రజితారెడ్డి, ఎంపీడీఓ ఖాజా అఫ్గర్‌అలీ, ఎస్ఐ పరమేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి**

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 20: జిల్లావ్యాప్తంగా మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌లో జిల్లా ఎప్పుడూ నాలుగో స్థానంలో ఉంటుందని, ఆ స్థానాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. న్యాయవాదుల సహకారం లేకుంటే అనుకున్న స్థానాన్ని చేరలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి ఫార్వీన్ కౌసర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.అపూర్వ రవళి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి మల్లయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.సవీందర్, న్యాయవాదులు జె.శశిధర్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలి : ఏడీఏ

ఎర్రవరం గోదాంలో నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ ఎల్లయ్య

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20: రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏడీఏ డి.ఎల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రవరం ఎరువుల గోదాంను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎరువుల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. అనంతరం గోదాం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, సీఈఓ హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

'నెమ్మికల్ పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలి'

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మండల విద్యా కమిటీ సభ్యులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 20: మండలంలోని నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలని కోరుతూ మండల విద్యాకమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ హసీంకు గురువారం వినతిపత్రం అందజేశారు. తరగతి గదులు కూలే స్థితిలో ఉండడంతో విద్యార్థులు భయంభయంగా పాఠశాలకు హాజరవుతున్నారని తెలిపారు. నెమ్మికల్‌లో కళాశాల కోసం అదనంగా నిర్మించిన భవనం నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా నిరుపయోగంగా ఉందని, అందులోకి పాఠశాలను మార్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు నాగమ్మ, లక్ష్మమ్మ, పద్మ, లింగమ్మ, ఎంవీఎఫ్ ఇన్‌చార్జి లలిత, సైదమ్మ, అలివేలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 20: ఈ నెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తాసీల్దార్ సైదులు, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ రవీందర్ గురువారం పరిశీలించారు. మండలంలో మొత్తం 95 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, అందుకు అనుగుణంగా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గరిడేపల్లి: పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో త్రిపురం సుధాకర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి అందిస్తానని క్లబ్ సభ్యుడు సరికొప్పుల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండ్రెటి సైదిరెడ్డి, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, లాయర్ విశ్వనాథ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: మండలంలోని వెంకేపల్లి హైస్కూల్ విద్యార్థులు 20 మందికి అశోక్ చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్, మూడ్ మోహన్, మరకంటి అశోక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట మౌన దీక్ష

నాగారం, ఫిబ్రవరి 20: తనను ప్రేమించి మోసం చేశాడని ఆరోపిస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి మౌన దీక్షకు దిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన మల్లెపాక నాగరాజు హైదరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, నాగరాజు, తాను మూడు సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నామని, ఇప్పుడు తనను కాదని మరొకరితో వివాహానికి సిద్ధమయ్యాడని ఆరోపిస్తూ తుంగతుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి గురువారం నాగరాజు ఇంటి ఎదుట మౌన దీక్షకు దిగింది.

బియ్యం వితరణ

గరిడేపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని గారకుంట తండా పల్లె ప్రకృతి వనంలో వన సేవకుడిగా పని చేస్తున్న ఆవురెల్ల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుగులోతు నీలా హేమ్లా నాయక్, నరేందర్‌నాయక్ గురువారం వెంకటేశ్వర్లు కుటుంబానికి 25 కిలోల బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరంరెడ్డి శంభిరెడ్డి, షాంపూనాయక్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, బచ్చలకూరి కోటయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20: మండలంలోని లింగగిరి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20: కోతుల దాడిలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని నాగులపహాడ్ గ్రామానికి చెందిన మీసాల ఎల్లమ్మ అనే వృద్ధురాలు గురువారం తన ఇంటి ముందు ఉండగా ఒక్కసారిగా కోతుల గుంపు మీద పడి కరవడంతో కంటికి, నుదుటి భాగాన, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తొలుత పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా మండల వైద్యాధికారి స్రవంతి, స్టాఫ్‌నర్స్ సుజాత చికిత్స నిర్వహించారు. అనంతరం వారి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు భూమి పూజ

తుంగతుర్తి, ఫిబ్రవరి 20: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న మోడల్ హౌస్ నిర్మాణానికి తాసీల్దార్ దయానందం, హౌసింగ్ ఏఈ అంతటి వెంకన్న ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్‌రెడ్డి, సిబ్బంది రాము, వెంకన్న, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారిపై కేసు

మద్గిగూడ, ఫిబ్రవరి 20 : మండలంలోని వట్టిపల్లిలో సర్వే నంబర్ 372లో 3.13ఎకరాల రామలింగేశ్వరస్వామి ఆలయ భూమి లో పెంచిన హరితహారం చెట్లను నరికిన వారిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. హరితహారం చెట్లను యంత్రం సాయంతో తొలగించిన విషయమై ఈ నెల10న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'పచ్చని చెట్లు పేకేశారు' శీర్షిక కథనం ప్రచురితమైంది. అయితే రాజకీయ ఒత్తిళ్లు, నాటకీయ పరిణామాల మధ్య ఆలస్యంగా స్పందించిన అధికారులు చెట్లు నరికిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రికెట్ ఆట ఆడుకోవడానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గత నెల 29న హరితహారం చెట్లను తొలగించి గ్రౌండ్‌ను తయారు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి : డీఎంహెచ్ఓ

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కోటాచలం

గరిడేపల్లి, ఫిబ్రవరి 20: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ కోటాచలం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఫార్మసీ, ప్రాథమిక పరీక్ష గది, ఓపీ విభాగం, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గారకుంట తండా గ్రామంలో నిర్వహించిన నిక్షయ్ శివర్ క్యాంప్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.నరేశ్, వీరయ్య, టీబీ నోడల్ సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి'

పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న తాసీల్దార్ మంగా రాథోడ్

మఠంపల్లి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను తాసీల్దార్ మంగా రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా ఉండడం లేదని, అన్నం తింటుంటే కడుపునొప్పి వస్తున్నదని పలువురు విద్యార్థులు సమాధానం ఇవ్వడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను, ప్రిన్సిపాల్‌ను కారణాలపై ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వంటశాల, స్కూల్ కాంపౌండ్, తాగునీరు, మరుగుదొడ్లు, స్కూల్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గిర్దావర్ జాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు'

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, మోటివేషనల్ స్పీకర్ సైదయ్యగౌడ్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20: పరీక్షల సమయంలో పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని మునగాలలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మోటివేషనల్ స్పీకర్ బూర సైదయ్యగౌడ్ అన్నారు. గురువారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో తెల్లవారుజామునే లేచి చదవాలని, రాత్రివేళ తొందరగా పడుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.మార్కండేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలో కంపచెట్ల తొలగింపు

కాల్వలో కంపచెట్లు తొలగిస్తున్న కూలీలు

నూతనకల్, ఫిబ్రవరి 20: ఎస్సారెస్పీ కాల్వల్లోని కంపచెట్లు, రాళ్ల తొలగింపు పనులు చేపడుతున్నామని ఇరిగేషన్ డీఈ హరికృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వలో కంపచెట్లు, రాళ్ల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిపారుదలకు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగిస్తున్నామని, చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేలా కృషి చేస్తున్నామని వివరించారు. రైతులు కాల్వకు అక్రమంగా గండ్లు పెట్టినా, మోటార్లు పెట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

గుప్త నిధుల కోసం జరిపిన తవ్వకాలు

తిరుమలగిరి, ఫిబ్రవరి 20: తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నందాపురం గ్రామంలో కాకతీయుల కాలం నాటి ప్రాచీన ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. గురువారం తెల్లవారుజామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. గతంలో కూడా ఇదే ఆలయంలో అనేకసార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

'నేనెక్కడున్నా' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినిమా యూనిట్ సభ్యులు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 20: కోదాడ పట్టణానికి చెందిన మాధవ్ దర్శకత్వంలో వస్తున్న 'నేనెక్కడున్నా' సినిమా పోస్టర్‌ను గురువారం పట్టణంలోని ఓ బేకరీలో ఏర్పాటు చేసిన సినిమా యూనిట్ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాధవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత జర్నలిజం, సామాజిక కోణంలో నేనెక్కడున్నా చిత్రాన్ని హిందీ, తెలుగు భాషల్లో నిర్మించినట్లుగా తెలిపారు. సందేశాత్మక చిత్రంతో ఈ నెల 28న ప్రజల ముందుకు వస్తున్